క్లుప్తంగా

ఘనంగా స్వయం పరిపాలన



చిట్యాల : మండలంలోని నైన్‌పాక ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు దాసారపు శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయుడిగా బండారి సుష్మిత, ఉపాధ్యాయులుగా రామన్, అంజి, హర్షిత్, రామ్‌చరణ్, నవీన్, సాత్విక, విశాల్, శివప్రసాద్, గౌతమ్ వ్యవహరించారు. అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, వసంత, అరుణ, సాంబయ్య, సీఆర్పీ తిరుపతి పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న స్వరూప

మల్హర్ : మండలంలోని రుద్రారం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ బడితెల స్వరూపరాజయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 5, 6వార్డుల్లో రూ.8లక్షల జెడ్పీ నిధులు, రూ.5 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. రుద్రారం గ్రామ అభివృద్ధికి సహకరించిన ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సంగెం రమేష్, శ్రీను, సంగెం సత్యనారాయణ, మహేష్, పద్మ, రవళి, సమ్మక్క, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి దగ్ధం

కాటారం : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదవశాత్తు పత్తి దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కాటారం గ్రామానికి చెందిన బొడ్డు రాజబాపు ఇంట్లో పత్తి నిల్వ చేయగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలతో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి నిప్పంటుకొంది. చుట్టు పక్కల వారు అప్రమత్తమై నీళ్లు చల్లడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో రూ.15క్వింటాళ్ల పత్తి దగ్ధం కాగా రూ.60వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

లోపాలు సరిదిద్దేనా..?

మేడారం మహాజాతరలో భక్తుల ఇక్కట్లు

- ప్రముఖుల రాకతో గంటల తరబడి క్యూలోనే..
- తాగునీటి కోసం తండ్లాడిన భక్తులు

మేడారం మహాజాతర ముగిసింది. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించినట్లు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం భక్తులకు ఇక్కట్లు తప్పలేదు. ఈ జాతరలో జరిగిన లోటుపాట్లను గుర్తించి, మళ్లీ రెండేళ్లకు జరిగే మహాజాతరలోనైనా సరైన ఏర్పాట్లు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

– ఎస్‌ఎస్‌తాడ్వాయి



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు(ఫైల్)

వైద్యసేవలకు అవస్థలు



జాతరకు వచ్చిన భక్తులు వైద్య సేవలకు ఇబ్బందులు పడ్డారు. మేడారంలోని టీడీడీ కల్యాణ మండపంలో మెయిన్ ఆస్పత్రి ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి నార్లాపూర్ వరకు తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. జాతరకు సుమారుగా 15 కిలోమీటర్ల దూరం వరకు భక్తులు విడిది చేశారు. ఆకస్మాత్తుగా ఆరోగ్య సమస్యలు తలెత్తితే రద్దీలో మేడారంలోని ఆస్పత్రికి చేరడం ఇబ్బందిగా మారింది. మళ్లీ జాతర వరకు ఊరట్టం, కొత్తూరు గ్రామంలోనైనా శాశ్వత వైద్యశాల భవనం నిర్మించి, జాతర సమయంలో వైద్య సేవలు అందించాలని భక్తులు కోరుతున్నారు.

దర్శనానికి ఇబ్బంది

జాతరలో తల్లుల దర్శనానికి భక్తులు ఇబ్బందులు పడ్డారు. వీవీఐపీ, వీఐపీలు, అధికారులతోపాటు వారి కుటుంబాలను గద్దెలపైకి అనుమతించి సాధారణ భక్తులను అనుమతించ లేదు. అయితే చాలా మంది భక్తులు గద్దెలపైకి ఎలాగైనా వెళ్లాలనే పట్టుదలతో అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గద్దెల పైకి దర్శనానికి వెళ్లిన సమయంలో కోపోద్రిక్తులైన భక్తులు బెల్లం ముద్దలు, కొబ్బరి కాయలు గద్దెలపైకి విసిరేయడంతో గద్దెలపై ఉన్న వారికి గాయాలయ్యాయి.

అద్దె గదులు లేక ఇక్కట్లు

మేడారంలో దేవాదాయశాఖ తరఫున సత్రాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. మేడారం, రెడ్డిగూడెం, కన్నెపల్లి, ఊరట్టంలోని గ్రామస్తులు కర్రలు పాతి చుట్టూ పరదాలు కట్టి గదులుగా ఏర్పాటు చేశారు. ఒక్కోదానికి సుమారుగా రూ.3వేల వరకు అద్దె చెల్లించి ఉండాల్సిన పరిస్థితి. వేలాది మంది భక్తులు రోడ్ల మీద విడిది చేసి అమ్మవార్లను దర్శించుకోవడం గమనార్హం. అధికారులు గదుల నిర్మాణాలపై దృష్టిసారించడం లేదు. గదుల నిర్మాణంతో ఆదాయం పెరగడంతోపాటు భక్తులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. మేడారంలో ఐటీడీఏ అతిథిగృహం, రెవెన్యూ, కలెక్టర్, పీఆర్ గెస్ట్‌హౌజ్‌లను నిర్మించారు. కానీ భక్తుల అద్దె గదుల నిర్మాణాలపై దృష్టిసారించాలని భక్తులు కోరుతున్నారు.

తడకలతో ఉక్కపోత

క్యూలైన్‌లపై ఏర్పాటు చేసిన తడుకల వల్ల భక్తులు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. క్యూలో తాగునీటి వసతి లేకపోవడంతో దాహనికి అల్లాడారు. క్యూలైన్‌లపై ఎత్తుగా రేకులు ఏర్పాటు చేయడంతోపాటు ఫ్యాన్లు, తాగునీటి వసతి, వాష్ రూంలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. వీవీఐపీలు, వీఐపీలు అమ్మవార్ల దర్శనానికి వచ్చిన సమయంలో గంటకుపైగా క్యూలో భక్తులను ఆపేయడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీవీఐపీ, వీఐపీల దర్శనాలకు ప్రత్యేక క్యూ ఏర్పాటు చేస్తే బాగుంటుందని భక్తుల అభిప్రాయం.



ట్రాఫిక్ జామ్‌తో భక్తులకు తిప్పలు



ఈసారి జాతర సమయంలో తాడ్వాయి నుంచి పస్రా మార్గ మధ్యలో ఆర్టీసీ బస్సుల ట్రాఫిక్ జామ్‌తో భక్తులు అరిగోస పడ్డారు. జాతర నాలుగు రోజుల సమయంలో పస్రా నుంచి తాడ్వాయి మీదుగా మేడారానికి ఆర్టీసీ బస్సులు, వీవీఐపీ, వీఐపీల వాహనాలను అనుమతిస్తారు. ఈసారి వీవీఐపీ, వీఐపీలకు పెద్ద మొత్తంలో పాస్‌లు ఇవ్వడంతో పస్రా నుంచి తాడ్వాయి మీదుగా మేడారానికి బస్సుల తోపాటు వీవీఐపీలు, వీఐపీల వాహనాల రాకపోకలు సాగాయి. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి ఇబ్బందులు తలెత్తాయి. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడంతో భక్తులు తిండికి, తాగునీటికి అల్లాడారు. వీవీఐపీల వాహనాల రాకపోకలతోనే ఈమార్గంలో ఆర్టీసీ బస్సులకు ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని అధికారులు భావించారు. పస్రా నుంచి తాడ్వాయి, తాడ్వాయి నుంచి మేడారం, పస్రా నుంచి మేడారం వరకు రోడ్లను ఫోర్ లైన్ రోడ్లుగా విస్తరించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వేణుచందర్

చిట్యాల : విద్యార్థినులు ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సీఐ దాసారపు వేణుచందర్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రిన్సిపాల్ గొల్కొండ భిక్షపతి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సీఐ వేణుచందర్ హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకోవాలని సూచించారు. విద్యా విధానంలో ఎన్నో మార్పులు ఏర్పడ్డాయని వాటికి అనుగుణంగా విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని ఏర్పచుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. బాలికల రక్షణకు ప్రభుత్వం టోల్ ఫ్రీ సంబర్లను ఏర్పాటు చేసిందని వాటిని గుర్తు పెట్టుకోవాలని వివరించారు. సమావేశంలో ఎస్సై జంగిలి రమేష్, ప్రిన్సిపాల్ భిక్షపతి, వైస్ ప్రిన్సిపాల్ సత్యం, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ములుగు /ములుగు రూరల్ : బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి, మహా భోగ్‌బండారో, అన్నదానం కార్యక్రమాలు ఈ నెల 29వ తేదీన జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్ కాలనీ సేవాలాల్ గుడి ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పోరిక జయరాం, ప్రధాన కార్యదర్శి పోరిక సునీల్ నాయక్ తెలిపారు. ఈ ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి డా. ధనసరి సీతక్క ముఖ్య అతిథిగా, బంజారా ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు హాజరవుతున్నట్లు జయరాం తెలిపారు. ఈ వేడుకలకు ములుగు జిల్లాలోని యావత్ బంజారాలు, అన్ని కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు, యువకులు, అభిమానులు ప్రతీ ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ములుగు నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జ్ భూక్య జంపన్న అన్నారు.

ప్రత్యేక పూజలు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం శ్రీధర్‌బాబు మాతృమూర్తి జయశ్రీ ఆలయానికి రాగా ఆమెను అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి పూజలు చేసి శుభానందదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీటీసీ మమత, నాయకులు మెంగాని అశోక్, సారయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

మొగుళ్లపల్లి : యాదగిరిగుట్టలో నేడు (మంగళవారం) తలపెట్టిన ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల 3194 యూనియన్ 55వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాయకులు హర్షం స్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల సమావేశం వైద్యాధికారి నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు రావాల్సిన నాలుగు డీఏలు, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 317 జీఓలో అన్యాయం జరిగిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, వైద్య ఆరోగ్య శాఖలో ఏర్పాటుచేసిన 142 జీఓను విరమించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు తాళ్లపల్లి రవీందర్, హెల్త్ ఎడ్యుకేటర్ రేష్మ, సూపర్‌వైజర్ సునీత, ల్యాబ్ టెక్నీషియన్ హర్షం సంపూర్ణ, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ఏఎన్ఎం సునీత, శ్రీను తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీఐ కార్యకర్తకు సన్మానం



కుమార్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, అధికారులు

మల్హర్ : మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన ఆర్టీఐ కార్యకర్త చింతల కుమార్ యాదవ్‌ను ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, అధికారులు సోమవారం ఘనంగా సన్మానించారు. సామాజిక కార్యకర్తగా, సమాచార హక్కు చట్టం రక్షణవేదిక కన్వీనర్‌గా ఎన్నికై హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు శిక్షణ పొంది రాష్ట్ర స్థాయి సర్టిఫికెట్ పొందిన సందర్భంగా కుమార్‌ను శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అవినాష్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్‌సుందర్, పీఆర్ఏఈ అశోక్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిత, ఎంపీఓ విక్రమ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

చిట్యాల : వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు వెంట కలిగి ఉండాలని సీఐ వేణుచందర్ అన్నారు. ఈసందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలు నడిపే వారి వద్ద అనుమతి పత్రాలు కలిగి ఉండాలని, సరైన పత్రాలు లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఆయన వెంట సెకండ్ ఎస్సై ఎండి షాఖన్, పోలీస్ సిబ్బంది సురేందర్, యాకయ్య, అస్లాం తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి



మొగుళ్లపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు



కాటారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సమ్మయ్య

- ప్రత్యేకాధికారులతో సమీక్ష సమావేశం
- పాల్గొన్న గ్రామపంచాయతీ కార్యదర్శులు

టేకుమట్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తుగా తగిన చర్యలు చేపట్టాలని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మండల పరిషత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటి నుంచే గ్రామాల్లో చేతి పంపులు, మంచినీటి మోటార్లు, పైపులైన్లపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పని తీరును పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. విద్యుత్ మోటార్లు మరమ్మతులు వెంటనే ముందస్తుగా గమనించి రిపేర్ చేయించాలన్నారు. అవసరమైతే బోరు బావులను అద్దెకు తీసుకోవాలన్నారు. అత్యవసరమైతే కొత్తగా బోర్‌వెల్ నిర్మాణం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఏ ఒక్క గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మండల ప్రత్యేకాధికారి శైలజ, ఎంపీడీఓ అనిత, ఎంపీఓ సురేష్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ రాణిబాయి ఆధ్వర్యంలో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎనుకపల్లి, కిష్టరావుపేట, సూరారం, చంద్రుపల్లి గ్రామల్లో నూతన చేతి పంపుల ఏర్పాటు, మండలంలోని 62 చేతి పంపుల మరమ్మతులు చేసేందుకు కావాల్సిన నిధుల మంజూరు చేయాలని కలెక్టర్‌కు తీర్మాన పత్రం ఇచ్చేందుకు ఆమోదించారు. అలాగే దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల భారతరత్న పురస్కారం ఇవ్వడం, ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరిపేందుకు ఉత్తర్వులు ఇవ్వడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలుపు ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ అరుణ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు సుధాకర్, దుర్గయ్య, అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

చిట్యాల : మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య రాకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రామయ్య అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తాగునీటి ఎద్దడి నివారణపై మండల ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎండాకాలంలో ప్రజలకు ఎలాంటి తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. గ్రామ ప్రత్యేకాధికారులు ముందస్తుగానే సమావేశంలో తహసీల్దార్ ప్రహ్లాద్, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈలు అనిల్‌కుమార్, తిరుపతి, ఎంపీఓ రామకృష్ణ, వివిధ గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాటారం : వేసవి కాలం దృష్ట్యా అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తాగునీటి ఎద్దడి నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి సమస్య రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, డీఈఈలు రమేశ్, సాయిలు, ఎంపీఓ ఉపేంద్రయ్య, జీపీ ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి : వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సునీత అన్నారు. సోమవారం తాగునీటి ఎద్దడిపై మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నత అధికారులకు తెలియజేయలన్నారు. ఈ సమావేశంలో జోరుక సదయ్య, వైస్ ఎంపీపీ పోల్నేని రాజేశ్వర్‌రావు, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ జయశ్రీ, ఎంపీఓ వీరస్వామి, ఎంపీటీసీ మంద సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



టేకుమట్ల: మాట్లాడుతున్న ఎంపీపీ మల్లారెడ్డి



మహదేవపూర్‌లో..



చిట్యాల: మాట్లాడుతున్న ఎంపీడీఓ రామయ్య

వ్యక్తి ఆత్మహత్య



మధుకర్ మృతదేహం

మొగుళ్లపల్లి : మద్యం మత్తులో గడ్డి మందు తాగి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఇప్పలపల్లికి చెందిన కూతురు మధుకర్(46) కొంత కాలంగా మద్యానికి బానిసై ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవలు పడేవాడు. గతంలోను మద్యం తాగిన మత్తులో పురుగుల మందు తాగి చనిపోతానంటూ బెదిరించేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగిన మధుకర్ ఇంటికి వచ్చి మత్తులో అకారణంగానే ఇంట్లో గొడవ చేసి గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుల అప్పటికే మధుకర్ మృతిచెందాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపారు.

అనారోగ్యంతో ఉరి వేసుకుని..

రేగొండ : అనారోగ్యం తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పొనగండ్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పొనగండ్లకు చెందిన పిట్ట నరసింహ (55) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది, ఇంటి వద్ద మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి టేకు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రణాళికతో చదివితే లక్ష్యసాధన ఖాయం

- డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌కుమార్

నల్లబెల్లి : ప్రణాళికతో చదివితే లక్ష్యసాధన ఖాయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎర్రా విజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)లో టెన్త్, ఇంటర్ విద్యార్థినులకు సోమవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో విజయ్‌కుమార్ మాట్లాడారు. పరీక్షల పట్ల భయాన్ని వీడాలని సూచించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను అధ్యయనం చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని చెప్పారు. అనంతరం విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేశారు. తొలుత రాజీవ్ బాలస్వాస్థ్య కార్యక్రమ (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో డాక్టర్ స్వర్ణలత పర్యవేక్షణలో కళాశాల విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణలత మాట్లాడారు. విద్యార్థినులు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. మొత్తం 78 మందికి పరీక్షలు నిర్వహించగా 8 మంది విద్యార్థినులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. బాధితులకు మెరుగైన చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో ఎస్ఓ సునీత, దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య, ఏఎన్ఎంలు జులేఖ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

'దళితబంధు' నిధులు విడుదల చేయాలి



మహదేవపూర్ : దళిత బంధు పథకం నిధులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలువు రు నాయకులు మాట్లాడుతూ.. దళితబంధు పథ కం నిధులు వెంటనే మంజూరు చేయాలని కోరా రు. లేని పక్షంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కో ఎంపీ స్థానానికి 100 నామినేషన్లు వేస్తామని ఈ సందర్భంగా నిర్ణయించారు. సమావేశంలో దళిత బంధు ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంపత్ మహరాజ్, ఉపాధ్యక్షుడు వేమునూరి జ క్కయ్య, ప్రధాన కార్యదర్శి మేరుగు శేఖర్, చకినర పు చందు, పులిగంటి రామన్న, మంత్రి రాజాబాపు, లంగాల రామయ్య, తదితరులు పాల్గొన్నారు.